క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలోనే ఉన్నా..



వైఎస్సార్ సీపీ లోనే ఉన్నానంటున్న అజ్జరం ఎంపీటీసీ సభ్యురాలు అల్లు ఊర్వశి

పెరవలి: జనసేన కండువా వేసినంత మాత్రాన తాను ఆ పార్టీలో చేరినట్టు కాదని, ఎప్పటికీ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన వైఎస్సార్ సీపీలోనే కొనసాగుతానని మండలంలోని అజ్జరం ఎంపీటీసీ సభ్యురాలు అల్లు ఊర్వశి సోమవారం స్పష్టం చేశారు. ఆదివారం రాత్రి గ్రామంలో ప్రచారానికి వచ్చిన జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు తన భర్త అనారోగ్యం విషయం తెలుసుకుని ఇంట్లోకి వచ్చి పలకరించారని ఆమె వివరించారు. అదే సమయంలో గ్రామంలోని జనసేన నాయకులు వెనక నుంచి ఆ పార్టీ కండువాను తన మెడలో వేశారని ఊర్వశి తెలిపారు. అంతమాత్రానికే తాను ఆ పార్టీలో చేరానని ప్రచారం చేయడం దారుణమన్నారు. తాను పార్టీ మారలేదని ఆమె స్పష్టం చేశారు.

వనిత, డాక్టర్ శ్రీనివాస్‌లకు మద్దతుగా ప్రచారం



గోపాలపురంలో మంత్రి వనితకు మద్దతుగా ఎన్నికల ప్రచారం

గోపాలపురం: వైఎస్సార్ సీపీ స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లకు మద్దతుగా ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు మండలంలోని తమతమ గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. నాలుగు రోజులుగా ఈ ప్రచారం పల్లెపల్లెనా హోరెత్తిపోతోంది. అత్యధిక మెజారిటీతో తమ అభ్యర్థులను గెలిపించుకుంటామని గోపాలపురం సొసైటీ చైర్మన్ కూసం రామమోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన పార్టీ శ్రేణులతో కలసి గోపాలపురం రజకపేటలో ఆయన ప్రచారం చేశారు. శాప్ డైరెక్టర్ కప్పల వరలక్ష్మి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ముల్లంగి శ్రీనివాసరెడ్డి, దేవస్థానం కమిటీ చైర్మన్ పడమట సత్యనారాయణ, మండల రైతు సంఘం అధ్యక్షుడు జొజ్జవరపు ఆనందపాల్, యాళ్ల శ్రీను, పార్టీ పట్టణశాఖ అధ్యక్షుడు ముల్లంగి శ్యామ్‌సుందర్‌రెడ్డి, అవుతు చిన్ని గోపాలపురం తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాలకు మే నెల పింఛన్లు

నిడదవోలు: మున్సిపాలిటీ పరిధిలోని సామాజిక పింఛనుదారులకు మే నెల పెన్షన్లను వారి బ్యాంక్ ఖాతాలకు జమ చేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ రాంభూపాల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంక్ ఖాతాలు లేని వారికి, దివ్యాంగులు, వ్యాధులతో మంచంపై లేవలేని స్థితిలో ఉన్న వారికి సచివాలయ కార్యదర్శులు ఇంటి వద్దకు వెళ్లి పింఛను అందిస్తారని ఆయన పేర్కొన్నారు. పింఛనుదారులెవరూ సచివాలయాలకు రానవసరం లేదన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

దేవరపల్లి: ప్రమాదవశాత్తూ మృతి చెందిన దేవరపల్లికి చెందిన జట్టు కార్మికుడు గొల్లా శ్రీను కుటుంబ సభ్యులకు మానవత సంస్థ మండల శాఖ సోమవారం రూ.ఐదు వేల ఆర్థిక సాయాన్ని అందించింది. అలాగే టెన్త్ పరీక్ష ఫలితాల్లో 600కు , 594 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమస్థానం సాధించిన అంబటి రేవాంత్‌కు రూ. 2 వేల నగదు ప్రోత్సాహక బహుమతిని అందజేసింది. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఈద్పుగంటి నాగేశ్వరరావు, ప్రతినిధులు బళ్ల సూర్యచక్రం, పప్పు వెంకటరామారావు, తీగెల రాజా, కేశిరాజు రాజ్‌కుమార్, బలుసు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఓటు ప్రాముఖ్యతపై అవగాహన

చాగల్లు: చాగల్లు: ఓటు ప్రాముఖ్యతపై గౌరిపల్లి పంచాయతీ పరిధిలో ఎంపీడీఓ నాతి బుజ్జి సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మే 13 న జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో వయోజనులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఉపాధి హామీ కూలీలు వడదెబ్బ బారిన పడకుండా ఏఎన్ఎంల ద్వారా ఓఆర్ఎస్ఎల్ ప్యాకెట్లు పంపిణీ చేపట్టామని చెప్పారు.

దోమలు నివారణపై అవగాహన

నల్లజర్ల: దోమల నివారణపై అవగాహన, అప్రమత్తత అవసరమని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. సోమవారం ఆయన సిబ్బందితో కలసి మండలంలోని సింగరాజుపాలెం, కొండాయగుంట గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలానుగుణంగా వచ్చే వ్యాధులపై ఆందోళన, అపోహలు చెందవద్దన్నారు. అవగాహనతో వ్యవహరించి అప్రమత్తంగా ఉండాలన్నారు.

బరిలో నిలిచింది వీరే

- ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ
- పోటీలో మిగిలిన అభ్యర్థుల ఖరారు
- కొవ్వూరులో 11 మంది..



తలారి వెంకట్రావు (వైఎస్సార్ సీపీ - కొవ్వూరు)



జి. శ్రీనివాస్‌నాయుడు (వైఎస్సార్ సీపీ - నిడదవోలు)



తానేటి వనిత (వైఎస్సార్ సీపీ- గోపాలపురం)

కొవ్వూరు: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం సోమవారం మధ్యాహ్నం మూడు గంటలతో ముగిసింది. ప్రజాక్షేత్రంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకునే అభ్యర్థులు ఎవరో స్పష్టత వచ్చింది. కొవ్వూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం అసెంబ్లీ సెగ్మెంట్లలో ఎంతమంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు? వారు ప్రాతినిధ్యం వహిస్తున్న రాజకీయ పార్టీలు, ఎన్నికల అధికారులు వారికి కేటాయించిన గుర్తులను ఓసారి పరిశీలిద్దాం.

కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 11 మంది పోటీలో నిలిచారు. స్క్రూటినీ అనంతరం 12 మంది అభ్యర్థులు బరిలో ఉండగా, వారిలో బహుజన సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి చోళ్ల కుమారి తన నామినేషను ఉపసంహరించుకున్నారు. గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ పార్టీల అభ్యర్థుల జాబితాను ప్రాధాన్యత క్రమంలో అక్షర మాలను అనుసరించి అధికారులు సిద్ధం చేశారు. వరుస క్రమంలో అరిగెల అరుణకుమారి (కాంగ్రెస్ పార్టీ- హస్తం), తలారి వెంకట్రావు (వైఎస్సార్ సీపీ- సీలింగ్ ఫ్యాన్), ముప్పిడి వెంకటేశ్వరరావు (తెలుగుదేశం- సైకిల్) ప్రధాన పార్టీల నుంచి పోటీలో ఉన్నారు. మరో మూడు పార్టీల తరఫున ఒక్కొక్కరు పోటీ పడుతుండగా, ఐదుగురు స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నారు.ఈ వివరాలను కొవ్వూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ వెల్లడించారు.

నిడదవోలు బరిలో 12 మంది..

నిడదవోలు: నిడదవోలు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 12 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. మొత్తం 13 మందిలో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన కందుల కృష్ణతేజ తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో నియోజకవర్గం నుంచి 12 మంది బరిలో నిలిచారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్.వెంకటరమణ తెలిపారు. ప్రధానంగా జి. శ్రీనివాస్‌నాయుడు (వైఎస్సార్ సీపీ- సీలింగ్ ఫ్యాన్), పెద్దిరెడ్డి సుబ్బారావు (కాంగ్రెస్- హస్తం), కందుల దుర్గేష్ (జనసేన-, గాజు గ్లాసు) పోటీలో ఉన్నారు. మరో ఆరుగురు అభ్యర్థుల చిన్న చిన్న పార్టీల తరఫున పోటీ పడుతున్నారు. మరో ముగ్గురు ఇండిపెండెంట్లుగా బరిలో ఉన్నారు.

గోపాలపురంలో 10 మంది..

గోపాలపురం: నామినేషన్ల పరిశీలన అనంతరం గోపాలపురం అసెంబ్లీ సెగ్మెంట్‌లో మొత్తం 11 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వారిలో జొన్నకూటి బాబాజీరావు తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. మిగిలిన 10 మంది అభ్యర్థులు తుది పోటీలో ఉన్నట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.లక్ష్మీశివజ్యోతి సోమవారం ప్రకటించారు. వారిలో తానేటి వనిత (వైఎస్సార్ సీపీ- సీలింగ్ ఫ్యాన్), మద్దిపాటి వెంకటరాజు (తెలుగుదేశం -సైకిలు), సోడదాసి మార్టిన్ లూథర్ (కాంగ్రెస్- హస్తం) ప్రధానంగా పోటీలో ఉన్నారు. మరో నలుగురు అభ్యర్థులు చిన్న పార్టీల తరఫున పోటీ పడుతున్నారు. ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

నేడు చంద్రవరం, కొవ్వూరుల్లో తలారి ప్రచారం

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు మంగళవారం ఉదయం చాగల్లు మండలం చంద్రవరం గ్రామంలో ప్రజాశీర్వాదం పేరుతో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేస్తారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి కొవ్వూరు మున్సిపాలిటీ పరిధిలోని ఆరు, ఏడు, ఎనిమిది వార్డులతో పాటు 14,15,16,18,19, 21వ వార్డులో రథంపై నుంచి ఎన్నికల ప్రచారం చేస్తారు. కావున నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని తలారి కోరారు.

ద్వారకా తిరుమల మండలంలో వనిత..

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత మంగళవారం ఉదయం 8 నుంచి రాత్రి 10 గంటల వరకూ ద్వారకాతిరుమల మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఆ పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసుబాబు తెలిపారు. ఉదయం 7.30 గంటలకు ద్వారకా తిరుమలలో వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకుని అనంతరం 8 గంటలకు ఐఎస్. జగన్నాథపురం, రామానుజపురం, ఐఎస్ రాఘవాపురం, లక్ష్మీపురం, సాయంత్రం నాలుగు గంటలకు గొడుగుపేట, జి. కొత్తపల్లి, కొత్తగూడెం, రామసింగరం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని తెలిపారు.

బాబు హామీలన్నీ నీటి మూటలే

- ప్రజలు వాటిని నమ్మడం లేదు
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు
- తాళ్లపూడి మండలంలో విస్తృత ప్రచారం
- అడుగడుగునా హారతులు, బైక్ ర్యాలీలు



వేగేశ్వరపురంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు తదితరులు

తాళ్లపూడి: మరోసారి మోసగించేందుకే సూపర్ సిక్స్ పేరుతో బూటకపు హామీలు ఇస్తున్న చంద్రబాబును ప్రజలు నమ్మడం లేదని వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు అన్నారు. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకూ మండలంలోని వేగేశ్వరపురం, బల్లిపాడు, అన్నదేవరపేట, మలకపల్లి గ్రామాల్లో పార్టీ శ్రేణులతో కలసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. భగభగలాడుతున్న ఎండను సైతం లెక్క చేయకుండా తలారి వెంకట్రావు ప్రజలతో మమేకం అయ్యారు. వేగేశ్వరపురంలోని వినాయకుడి గుడి వద్ద కొబ్బరికాయ కొట్టి ఉదయాన్నే ప్రచారానికి శ్రీకారం చుట్టారు. మహిళలు హారతులిచ్చి, గుమ్మడి కాయలతో దిష్టి తీశారు. యువకులు ఉత్సాహంగా తలారి ఎన్నికల ప్రచార రథం ముందుభాగంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తలారి వెంకట్రావు మాట్లాడుతూ ఆచరణ సాధ్యం కాని హామీలు ఇవ్వడం చంద్రబాబుకు అలవాటే అన్నారు. అందుకు భిన్నంగా జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసి చూపించారన్నారు. నవరత్నాలు ప్లస్ పేరుతో వివిధ సంక్షేమ పథకాల లబ్ధిని పెంచడంతో పాటు అమలు చేసే వాటిని మాత్రమే తాజా మేనిఫెస్టోలో జగన్ ప్రకటించారన్నారు. రానున్న ఎన్నికల్లో రెండు ఓట్లు కూడా ఫ్యాన్ గుర్తుకు వేసి అత్యధిక మెజార్టీతో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో వేగేశ్వరపురం, బల్లిపాడు, అన్నదేవరపేట సర్పంచులు కొమ్మిరెడ్డి పరశురామారావు, ఎల్లిన శివరామకృష్ణ, ఎలిపే సుధారాణి, సొసైటీ అధ్యక్షులు కుంటముక్కల కేశవనారాయణ, పోసిన శ్రీకృష్ణదేవరాయలు, ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, పార్టీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు ఎం.దమయంతి, నాయకులు తోట రామకృష్ణ, వల్లభశెట్టి శ్రీనివాస్, పిట్టా శ్రీనివాస్, నక్కా చిట్టిబాబు, నామా ప్రకాశం, యాళ్ల బాబూరావు, సాయన సుబ్బారావు, మండిగ గిరి, మైగాపుల ఆంజనేయులు, గనిశెట్టి బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

జగన్ అంటే నమ్మకం .. బాబు అంటే మోసం



అన్నదేవరపేటలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు

- వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్
- ఎమ్మెల్యే అభ్యర్థి తలారితో కలసి అన్నదేవరపేటలో ఎన్నికల ప్రచారం

తాళ్లపూడి: జగనన్న అంటే నమ్మకమని, చంద్రబాబు అంటే మోసమని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. చెప్పింది చేయడానికే సంక్షేమ, అభివృద్ధికి పెద్ద పీట వేస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటించారన్నారు. వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు డాక్టర్ శ్రీనివాస్, తలారి వెంకట్రావు పార్టీ శ్రేణులతో కలిసి మండలంలోని అన్నదేవరపేటలో సోమవారం ఎన్నికల ప్రచారం చేశారు. ప్రచార రథం పై నుంచి వారిద్దరూ ప్రజలకు అభివాదం చేస్తు ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా డాక్టర్ గూడూరి మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రజలు రెండు ఓట్లనూ ఫ్యాన్ గుర్తుకు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ప్రచారంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోశిన శ్రీలేఖ, పార్టీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, సర్పంచ్ ఎలిపే సుధారాణి, పిట్టా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌నాయుడికి మద్దతుగా ప్రచారం

నిడదవోలు: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్ నాయుడికి మద్దతుగా ఆయన కుమారుడు వరుణ్‌సాయి సోమవారం పట్టణంలోని 28వ వార్డులోను, ఉండ్రాజవరం మండలంలోని తాడిపర్రు గ్రామంలోను ఎన్నికల ప్రచారం చేశారు. పట్టణంలో చేపట్టిన అభివృద్ధితో పాటు ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వరుణ్‌సాయి మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి రెండో సారి కూడా తన తండ్రిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడి తరఫున ఆయన తనయుడు వరుణ్ సాయి మండలంలో తాడిపర్రులో సాయంత్రం ప్రచారం చేశారు. సాయి ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ప్రచారంలో ఎంపీటీసీ సభ్యుడు కట్టా వెంకటేశ్వరరావు, ఆ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కరుటూరి వెంకటేశ్వరరావు, జి.తాతారావు తదితరులు పాల్గొన్నారు.

వేలివెన్నులో భాస్కరరామయ్య..

ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్ నాయుడు, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ మండలంలో వేలివెన్నులో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య ఇంటింటా ప్రచారం చేశారు. ఆ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు శిరిగిన శివ రాధాకృష్ణ, ముళ్లపూడి కేశవరావు, పణితన పార్వతి, బీసీ నాయకులు పాకలపాటి వీరవెంకట సత్యనారాయణ, ఆలపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నిడదవోలు మండలంలో..

నిడదవోలు రూరల్: వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు మద్దతుగా ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు గోపవరం, పందలపర్రు, తాళ్లపాలెం, కంసాలిపాలెం, కోరుమామిడి, తాడిమళ్ల గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకే వేయాలని అభ్యర్థించారు. సర్పంచులు కొండపల్లి శ్రీనివాస్, పులుమంతుల నాగదుర్గ, ముప్పిడి చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యులు వీరప్రసాద్, కర్రి సుజాత, సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



నిడదవోలు 28వ వార్డులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కుమారుడు వరుణ్‌సాయి



వేలివెన్నులో ఎన్నికల ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య

జగనన్న వచ్చాక పేదరికం దూరం

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, హోం మంత్రి తానేటి వనిత
- ఐదు గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం



శింగరాజుపాలెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి వనిత, వైఎస్సార్ సీపీ నాయకులు

నల్లజర్ల: స్వాతంత్ర్యం వచ్చాక గత 75 ఏళ్లలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిలా మరే ముఖ్యమంత్రీ పని చేయలేదని వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి, హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మన కుటుంబాల్లో పేదరికాన్ని దూరం చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగనన్న అని ఆమె అన్నారు. మండలంలోని పుల్లలపాడు, ముసుళ్లగుంట, శింగరాజుపాలెం, మారెళ్లమూడి, జగన్నాథపురం గ్రామాల్లో సోమవారం ఆమె విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. ఆమెకు అడుగడుగునా మహిళలు మంగళ హారతులిచ్చి, పూలతో స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్ అల్లూరి సూర్యచంద్రరావు, ఎంపీటీసీ వేగి ప్రతాప్, తాడిగడప శ్రీనివాస రావు, కొమ్ము బ్రహ్మయ్య, నీలపాల మహేష్, సర్పంచ్ గద్దే బాలగంగాధర తిలక్, ఎంపీటీసీ వామిశెట్టి పావనీకుమారి, పరమేశ్వరరావు, నెక్కలపూడి విజయలక్ష్మి, సర్పంచ్ ప్రగడ సుబ్రహ్మణేశ్వరి, ప్రగడ వెంకటేశ్వరరావు, లేళ్ల రాంపండు, సర్పంచ్ చెల్లారి రామ శ్రీనివాస్, ఎంపీటీసీ కాకర్ల రాజారావు, బొంగా సుబ్బారావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం సాగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న పిల్లలను ఉన్నత చదువులు చదివించడంతో పాటు అవ్వాతాతలకు ఇంటికే పెన్షన్ సౌకర్యం కల్పించారన్నారు. మహిళలకు ఆసరా, చేయూత వంటి పథకాలు కల్పించి ఒక సోదరుడిలా అండగా నిలిచారన్నారు. ఇంత మేలు చేసిన జగనన్నకు ఓటు ద్వారా మన రుణం తీర్చుకుందామని మంత్రి వనిత అన్నారు. పుల్లపాడులో యువకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రచారంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, పిచ్చుకుల ప్రసాద్, తొమ్మండ్రు రమేష్, మద్దిపాటి ప్రసాద్, వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నాయకులు మద్దూరి నాగేశ్వరరావు, సయ్యద్ మునాఫ్, ముప్పిడి వెంకటరత్నం, అచ్యుత వెంకటస్వామి, అల్లూరి చిన భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమికి ఓటేస్తే సంక్షేమానికి చెల్లుచీటీ

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్ నాయుడు
- కాకరపర్రు, వెంకట్రాయపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



వెంకట్రాయపురంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్‌నాయుడు

పెరవలి: మాయమాటలు చెప్పే తెలుగుదేశం కూటమికి ఎన్నికల్లో ఓటు వేస్తే మీ సంక్షేమాన్ని, ఇప్పటి వరకూ మీకు అందుతున్న సంక్షేమానికి ఆశలు వదులుకోవాల్సి ఉంటుందని వైఎస్సార్ సీపీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. మండలంలోని కాకరపర్రు, వెంకట్రాయపురం గ్రామాల్లో సోమవారం ఆయన జోరుగా ఎన్నికల ప్రచారం చేశారు. ప్రజలు ఆయనకు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. మహిళలు హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ చంద్రబాబు మాటలు నమ్మితే నట్టేట ముంచేస్తాడన్నారు. ప్రతి పేదవాడికి సంక్షేమం అందాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కాకరపర్రు పంచాయతీని మోడల్ విలేజ్‌గా చేయాలనే సంకల్పంతో రూ.35 కోట్లతో ఈ పంచాయతీ పరిధిలో వివిధ అభివృద్ధి పనులు చేశామన్నారు. అలాగే వివిధ సంక్షేమ పథకాల ద్వారా గ్రామస్తులకు రూ.30 కోట్ల మేర లబ్ధి చేకూర్చామన్నారు. ఈ ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకే వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. ప్రచారంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, కాకరపర్రు, వెంకట్రాయపురం సర్పంచులు గుబ్బల ఆదిలక్ష్మి, పోలిశెట్టి బాలాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు చెర్ల శ్రీరామచంద్రమూర్తి, నామన అంజిబాబు, సురేంద్ర, వాసురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి జనసేన వార్డు సభ్యుడు

వెంకట్రాయపురంలో శ్రీనివాస్‌నాయుడు ప్రచారం చేస్తుండగా, జనసేనకు చెందిన పంచాయతీ వార్డు సభ్యురాలు బొద్దిరెడ్డి లక్ష్మి, టీడీపీ నాయకులు వెంద్ర ధనరాజు, యడ్ల అప్పారావు, బొద్దిరెడ్డి శివలు ఆయనను కలిసి వైఎస్సార్ సీపీలో చేరేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. శ్రీనివాస్‌నాయుడు వారందరికీ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.



వెంకట్రాయపురంలో పార్టీలో చేరిన జనసేన, టీడీపీ నాయకులకు సాదర స్వాగతం

కాంగ్రెస్, టీడీపీల నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు



పైడిమెట్టలో కాంగ్రెస్, టీడీపీల నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన వారితో అభ్యర్థి తలారి వెంకట్రావు



వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి తానేటి వనిత

తాళ్లపూడి: ప్రక్కిలంక పంచాయతీ పరిధిలోని పైడిమెట్ట గ్రామంలో కాంగ్రెస్, టీడీపీల నుంచి పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. ఆ పంచాయతీ సర్పంచ్ యాళ్ల స్వప్న సూచనల మేరకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ యాళ్ల బాబూరావు ఆధ్వర్యంలో వారంతా సోమవారం ఆ పార్టీలో చేరారు. ఆ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు వారందరికీ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో జిల్లా కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శి కొడమంచిలి చంద్రశేఖర్, టీడీపీ నుంచి కె.నాగరాజు, ఎం. మంగరాజు, కె.సూరిబాబు, వేణు, సీహెచ్ రాజు, జె.చిట్టిబాబు, జె.వినోద్‌కుమార్, చాందిని, స్వప్న తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథపురంలో 25 కుటుంబాలు

గోపాలపురం: మండలంలోని జగన్నాథపురానికి చెందిన టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన 25 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరారు. ఆ గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత వారందరికీ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మల్లిపూడి వెంకటేశ్వరరావు, నక్కా శ్రీను, చింతాడ ఆంజనేయులు, కుసుమంచి బులిరాజు, గుర్రం వెంకటేశ్వరరావు, తానింకి మౌనిక, ఇండిగమల్లి సౌజన్య, గెడ్డం సుధారాణి, మరో 100 మంది కార్యకర్తలు ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు విపక్షాల వారు వైఎస్సార్ సీపీ వైపు మొగ్గుచూపుతున్నారన్నారు.

20 లీటర్ల సారాతో మహిళ అరెస్టు

దేవరపల్లి: గోపాలపురం మండలం భీమోలు గ్రామంలో దేవరపల్లి ఎస్ఈబీ పోలీసులు సోమవారం దాడి జరిపి, ఓ మహిళ వద్ద నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఆ మహిళను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్టు సీఐ కేవీ స్వామి తెలిపారు. దాడుల్లో ఎస్సై పి.సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.